సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 17 । మే । 2024



మన తిరుమల

నారాయణ తిరుమలలో నేటి నుంచి కల్యాణోత్సవం జరగనుంది. ఏర్పాట్లు పూర్తయ్యాయి.

-8లో



జెమ్స్‌లో అవయవదానం

జెమ్స్‌లో మరో సారి అవయవదాన క్రతువు జరిగింది. టి.శ్రీనివాసరావు అవయవాలు దానం చేసి చిరంజీవిగా నిలిచారు.

-8లో

జిల్లా నూతన అధ్యక్షునికి అభినందన

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సమితి నూతన జిల్లా అధ్యక్షునిగా నియమితులైన నూర రామచంద్ర రావును పీఎన్ కాలనీ సత్యసాయి సేవా సమితి సభ్యులు గురువారం అభినందించా రు. సాయంత్రం జరిగిన అభినందన సభలో ఆ యన మాట్లాడుతూ సత్యసాయి సేవలను మరింత అధికం చేసే విధంగా పనిచేస్తానని అన్నారు.

న్యూస్‌రీల్

భద్రత పరిశీలన



సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ గురువారం పరిశీలించారు. భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు మూడు అంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 24 గంటల నిఘా కొనసాగుతుందని వివరించారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో వేస్తున్న పందిళ్లు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఒక్క రోజే సమయం ఉండటంతో నరసన్నపేటలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. శనివారం ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు 27వ తేదీ వరకూ నిర్వహిస్తారు. దీంతో ఆలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తుండగా మరో వైపు వీధుల్లో ప్రచారం చేస్తూ భక్తులు ఊరేగింపులు చేస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది పండితులు, రుత్విక్కులు పాల్గొంటారు. అలాగే ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుతో పాటు హిందూ ప్రచార సారధి రాధా మనోహరదాస్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. స్వామికి ప్రత్యేక రథాన్ని సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న పది రోజులూ రోజూ స్వామి వారి ఊరేగింపులు, రోజుకో అలంకరణలతో నిర్వహిస్తారు. స్థానిక వేంకటేశ్వరాలయానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆమదాలవలసలో అలరించిన అవధానం



అవధానంలో సమాధానాలు ఇస్తున్న అవధానులు

ఆమదాలవలస రూరల్: పట్టణంలో నిర్వహించిన అవధానం పలువురు సాహితీప్రియులను ఆకట్టుకుంది. శ్రీకచ్చపీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో గురువారం ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన అవధానం సాహిత్య ప్రియులను అలరించింది. బ్రహ్మశ్రీ సుసరాపు చంద్రశేఖరశర్మ, బ్రహ్మశ్రీ రంప సాయికుమార్‌శర్మతో 16 మంది ప్రాశ్నికులు అడిగిన ప్రశ్నలకు సందర్భోచితంగా, చమత్కారంగా సమాధానాలు ఇచ్చారు. దత్తపది, వ్యస్తాక్షరి, సమస్య, ఘంటా గణనం, వార గణనం, ఆశువు, వర్ణన వంటి తొమ్మిది అంశాలతో ద్విగళ ద్విగుణిత అవధానం అత్యంత రసవత్తరంగా సాగింది. సభా సంచాలకునిగా సాహిత్య రత్న బ్రహ్మశ్రీ బంకుపల్లి రమేశ్‌శర్మ వ్యవహరించారు. శ్రీ కచ్ఛపీ కళాక్షేత్రం ప్రధాన కార్యదర్శి బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మ, అధ్యక్షులు శ్రీరామ చంద్రమూర్తిశర్మ, గౌరవ అధ్యక్షులు ప్రతాప్ కుమార్, రొటేరియన్ వెంకుబాబు, జీజీ మోహనరావు, గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా పోలీసుకు తీవ్ర గాయాలు

గార: కళింగపట్నం సచివాలయం మహిళా పోలీసు పప్పు సుశీలకు గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సచివాలయం విధులు ముగిసిన అనంతరం పంచాయతీ బిల్ కలెక్టరు సవర రాజేశ్వరి, సుశీల ఒకే బైక్‌పై శ్రీకాకుళం వస్తుండగా, తూలుగు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుకు బలంగా ఢీకొట్టడంతో సుశీల తలకు బలమైన గాయమైంది. వెంటనే 108 వాహనం ద్వారా శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సుశీల తండ్రి పప్పు గోవిందరావు కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన వారు. సుగ్గదాలినాయుడు పేటలో టీచర్‌గా పనిచేస్తున్నారు.



ఎవరికి చేటు..?

- 132 బూత్‌ల్లో 59 శాతం లోపు పోలింగ్
- 49 శాతం లోపు పోలైన బూత్‌లు 33
- శ్రీకాకుళం అర్బన్‌లో 80 బూత్‌ల్లో తక్కువ పోలింగ్
- అర్బన్‌పై ఆశలు పెట్టుకున్న పార్టీకి అంతుచిక్కని పరిస్థితి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: పోలింగ్ శాతం పెరిగిందంటూ అంతా ఆనంద పడుతున్న సమయంలో కొన్ని చోట్ల ఏకంగా యాభై శాతంలోపు పోలింగ్ నమోదు కావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. జిల్లాలో ఇలాంటి పోలింగ్ బూత్‌లు 33 ఉన్నాయి. అంతే కాదు 132 బూత్‌లలో 59 శాతం లోపు పోలింగ్ నమోదు కావడం విశేషం. పోలింగ్ శాతాన్ని పెంచడానికి అధికారులు చేసిన ప్రయత్నాలు ఆ ప్రాంతాల్లో ఫలితం ఇవ్వలేకపోయాయి. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల్లో ఓటేసేందుకు పెద్ద ఎత్తున జనం పోటెత్తినా అక్కడ మాత్రం ఓటర్లు ఆసక్తి చూపలేదు. పోలింగ్ శాతం తగ్గడంపై ఎవరిపై ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం అర్బన్‌లో ఓటర్లు ఎప్పటిలానే ఈ సారి కూడా నిరాసక్తత చూపారు. తగ్గిన పోలింగ్‌తో పోటా పోటీ ఎన్నిక జరిగినట్టు భావిస్తున్న అభ్యర్థులు లాభనష్టాల లెక్కలు వేసుకుంటున్నారు.

132 బూత్‌ల్లో 59 శాతం లోపు పోలింగ్

జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. 2019 ఎన్నికల్లో 76.35 శాతం పోలింగ్ జరగ్గా ఈ సారి 76.81శాతం ఓటింగ్ నమోదైంది. 133పోలింగ్ బూతుల్లో 90 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. 927బూత్‌ల్లో 80శాతానికి పైగా పోలింగ్ అయింది. జిల్లా చరిత్రలో ఇదొక రికార్డు. అంచనాలకు మించి పోలవ్వడంపై ఎవరికి ప్లస్, ఎవరికి మైనస్ అన్నదానిపై విశ్లేషణలు జరుగుతున్నాయి. అదే సమయంలో పోలింగ్ శాతం తక్కువ నమోదైన బూత్‌లు కూడా ఎక్కువే ఉన్నాయి. జిల్లాలో 132 పోలింగ్ బూత్‌ల్లో 59శాతం లోపే ఓటింగ్ జరిగింది. అందులో 33 పోలింగ్ బూత్‌ల్లో అత్యల్పంగా 49శాతం లోపు పోలింగ్ అయింది. ఇప్పుడివి కొంతమంది అభ్యర్థులను కలవరపరుస్తున్నాయి.

శ్రీకాకుళంలో తీవ్ర ప్రభావం

- జిల్లాలో ప్రధానంగా శ్రీకాకుళం నియోజకవర్గంలోని అర్బన్‌లో పోలింగ్ శాతం తక్కువ నమోదైన కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి.
- 59 శాతం లోపు పోలింగ్ నమోదైన బూత్‌లు 50 ఉండగా, 49శాతం లోపు పోలైన బూత్‌లు 30వరకు ఉన్నాయి.
- ఇప్పుడీ పోలింగ్ బూత్‌లు తీవ్ర ప్రభావం చూపనున్నాయి. వీటిపైనే ఓ పార్టీ ప్రధానంగా ఆశలు పెట్టుకుంది. ఇక్కడ గణనీయంగా ఓటింగ్ తగ్గిపోవడంతో ఆ పార్టీలో కలవరం మొదలైంది. అర్బన్ ఓటింగ్ కలిసొస్తుందని ఎన్నో కలలు కనగా, అందుకు భిన్నంగా ఓటింగ్ జరగడంతో ఆందోళన మొదలైంది.

అత్యధికం.. అత్యల్పం

జిల్లాలో అత్యధికంగా నరసన్నపేట నియోజకవర్గంలోని 55వ పోలింగ్ బూతుల్లో 95శాతం ఓటింగ్ నమోదైంది. దాని తర్వాత స్థానంలో పలాస నియోజకవర్గంలోని పాత్రియాలో గల 91వ బూత్‌లో 94.84శాతం, శివరామకృష్ణపురంలోని 56వ బూత్‌లో 94.83శాతం, డబారుసింగిలోని 179వ బూత్‌లో 93.24శాతం పోలింగ్ జరిగింది. కాకపోతే, వీటిలో అత్యధికం చిన్న బూత్‌లే. అత్యల్పంగా చూస్తే శ్రీకాకుళం నగరంలోని 158వ బూత్‌లో గల గూనపాలెం 5లో 40.84 శాతం పోలింగ్ నమోదు కాగా, 155వ బూత్‌లోని గూనపాలెంలో 3లో 41.91శాతం నమోదైంది.

తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ బూత్‌లు

పోలింగ్ బూత్	ప్రాంతం	శాతం
శ్రీకాకుళం(158)	గూనపాలెం 5	40.84
శ్రీకాకుళం(155)	గూనపాలెం 3	41.91
శ్రీకాకుళం(262)	పీఎస్ఎం స్కూల్	41.96
శ్రీకాకుళం(262)	ఎస్ఈ, ఆర్అండ్‌బి	41.96
శ్రీకాకుళం(174)	మహలక్ష్మీనగర్	42.70
శ్రీకాకుళం(188)	చేపల వీధి	42.86
శ్రీకాకుళం(203)	ఫారెస్టు ఆఫీస్ 1	43.17
శ్రీకాకుళం(263)	పీఎస్ఎన్ స్కూల్	43.19
శ్రీకాకుళం(264)	పీఎస్ఎన్ స్కూల్	43.21
శ్రీకాకుళం(118)	గుజరాతిపేట	43.24
శ్రీకాకుళం(231)	అఫీషియల్ కాలనీ	44.05
శ్రీకాకుళం(265)	పీఎస్ఎన్ ఎంసీ స్కూల్	45.04
శ్రీకాకుళం(229)	అఫీషియల్ కాలనీ	45.28
శ్రీకాకుళం(181)	పీఎస్ఎన్ స్కూల్ 4	45.38
శ్రీకాకుళం(193)	ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ 3	45.43
శ్రీకాకుళం(159)	ఏపీహెచ్‌బీ కాలనీ అపోజిట్	45.81
శ్రీకాకుళం(214)	వంశధార క్వార్టర్స్	46.04
శ్రీకాకుళం(230)	అఫీషియల్ కాలనీ	46.41
శ్రీకాకుళం(201)	పుణ్యపు వీధి 2	46.85
శ్రీకాకుళం(207)	ఇరిగేషన్ ఆఫీస్	47.00
శ్రీకాకుళం(199)	పుణ్యపువీధి 1	47.56
శ్రీకాకుళం(171)	మధురానగర్ 1	47.67
శ్రీకాకుళం(172)	మధురానగర్ 2	47.78
శ్రీకాకుళం(175)	ఎంపీడీఓ ఆఫ్‌సరోడ్	47.75
శ్రీకాకుళం(261)	ఎస్ఈ ఆర్అండ్‌బి, సర్కిల్ ఆఫీస్	47.99
శ్రీకాకుళం(219)	బొందిలిపురం	48.93
శ్రీకాకుళం(156)	ఏపీహెచ్‌బీ కాలనీ, కార్గిల్ పార్క్	49.09
శ్రీకాకుళం(117)	గుజరాతీపేట	49.27
శ్రీకాకుళం(141)	ఓల్డ్ ఏపీహెచ్‌బీ కాలనీ	49.39
శ్రీకాకుళం(205)	ఇరిగేషన్ ఆఫీస్	49.45
టెక్కలి(103)	ఎంపీపీ ఆదర్శ ప్రాథమిక పాఠశాల	50.51
టెక్కలి(97)	టెక్కలి	53.52
టెక్కలి(99)	మండల మహిళా సమాఖ్య హాల్	55.10
టెక్కలి(104)	టెక్కలి	58.84
ఆమదాలవలస(33)	గవర్నమెంట్ జూనియర్ కాలేజ్	57.69
నరసన్నపేట(138)	గవర్నమెంట్ జూనియర్ కాలేజ్	58.33
నరసన్నపేట(140)	సంతమణి గుడి ఎదురు	58.36
పాతపట్నం(25)	గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ 7	57.13
పాతపట్నం(26)	గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ 13	58.93
పాతపట్నం(27)	పాతపట్నం ఎంపీపీ స్కూల్ రూమ్ 1	51.20
పాతపట్నం(28)	గవర్నమెంట్ హైస్కూల్ రూమ్ 5	50.79
పాతపట్నం(29)	గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ 14	52.26
పాతపట్నం(30)	గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ 12	52.95
పాతపట్నం(31)	ఎంపీపీ స్కూల్, రూమ్ 3	53.61
పాతపట్నం(33)	ఎంపీపీ స్కూల్ రూమ్ 1	57.93
పాతపట్నం(34)	ఎంపీపీ స్కూల్ రూమ్ 4	57.07
పాతపట్నం(36)	గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ 10	48.96
పాతపట్నం(42)	ఎంపీపీ స్కూల్, కాగువాడ	58.79
పాతపట్నం(61)	జెడ్పీ హైస్కూల్, రొంపివలస	57.44
పాతపట్నం(196)	కడుము జెడ్పీ స్కూల్	52.90
పాతపట్నం(298)	హిరమండలం గవర్నమెంట్ కాలేజ్	56.47
పాతపట్నం(301)	హిరమండలం గవర్నమెంట్ కాలేజ్	57.39
పాతపట్నం(304)	హిరమండలం ఎంపీపీ స్కూల్	58.99
ఇచ్ఛాపురం(19)	కొళిగాం జెడ్పీ స్కూల్	50.00
ఇచ్ఛాపురం(26)	బిర్లంగి జెడ్పీ స్కూల్	50.12
ఇచ్ఛాపురం(38)	ఇచ్ఛాపురం ప్రభుత్వ స్కూల్	50.34
ఇచ్ఛాపురం(71)	ఈదుపురం ఎంపీపీ స్కూల్	54.46
ఇచ్ఛాపురం(208)	ఎంపీపీ స్కూల్, తలాటం	56.11
ఇచ్ఛాపురం(209)	కళింగపాడు ఎంపీపీ స్కూల్	56.15
ఇచ్ఛాపురం(238)	సోంపేట జెడ్పీ హైస్కూల్	56.32
ఇచ్ఛాపురం(20)	కొళిగాం జెడ్పీ స్కూల్ 9	56.62
ఇచ్ఛాపురం(28)	బిర్లంగి ఎంపీపీ స్కూల్	56.91
ఇచ్ఛాపురం(230)	సోంపేట మహదేవిపేట ఎంపీపీ స్కూల్	57.73
ఇచ్ఛాపురం(57)	లొద్దపాడు జెడ్పీ స్కూల్	58.72
ఇచ్ఛాపురం(83)	ఎంపీయూపీ స్కూల్, సన్యాసిపుట్టుగ	58.71
పలాస(242)	తెరపల్లి ఎంపీఈ స్కూల్	48.88
పలాస(282)	ఒంకులూరు ఎంపీఈ స్కూల్	53.40
పలాస(279)	మెట్టూరు ఎంపీఈ స్కూల్	53.50
పలాస(265)	అమలపాడు ఎంపీఈ స్కూల్	55.87

బాధితులకు మంత్రి ధర్మాన పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: చాపురం పంచాయతీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఇటీవల ఎన్నికల సమయంలో కొంతమంది టీడీపీ సానుభూతిపరులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో గాయపడిన వారిని మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం పరామర్శించారు. అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలంటూ ఆయన వారికి భరోసా ఇచ్చారు. విపక్ష పార్టీల దౌర్జన్యాలకు అంతూపంతూ లేకుండా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు టీడీపీ నాయకుల ఆగడాల కారణంగా ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలు ఉద్రిక్తలకు దారి తీశాయని ఆయన విచారం వ్యక్తం చేశారు.

పకడ్బందీగా కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విధి నిర్వహణలో అంకిత భావం, అధికారుల మధ్య పూర్తి సమన్వయం కారణంగా జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆయన ఆర్‌ఓలు, పలువురు నోడల్ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని, అలాగే, స్ట్రాంగ్ రూమ్ల వద్ద సీసీ టీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ సంబంధించి సిబ్బంది ఎంపిక, వారికి వివిధ దశల్లో శిక్షణ పూర్తి చేయాల్సి ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్ల ప్లాన్ పక్కాగా నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం ప్రతి టేబుల్‌లో మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉండేలా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి, ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని, శివాని కాలేజీలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద ముందస్తు ఏర్పాట్లన్నీ సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, ఆర్వోలు నూరుల్ కమర్, భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, లక్ష్మణ మూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, సీపీఓ ప్రసన్న లక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్య కిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు, డీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, సర్వ శిక్ష పీఓ ఆర్.జయ ప్రకాశ్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు తదితర అధికారులు హాజరయ్యారు.

● సుమనోహరమే..



శ్రీకాకుళంలోని విశాఖ బి కాలనీలో ఉంటున్న అరవింద కుమారి ఇంటిలో మే పుష్పం గురువారం విరబూసింది. ఎంతో అరుదైన ఈ పుష్పాన్ని వీక్షించేందుకు చుట్టు పక్కల వారు ఆసక్తి కనబరుస్తున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్ల తరలింపు



టెక్కలి పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్‌ఓ నూరుల్ కమర్ సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్న పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా టెక్కలి నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌కు సంబంధించిన పత్రాలను గురువారం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఆర్‌ఓ నూరుల్ ఖమర్ పర్యవేక్షణలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతల సమక్షంలో సురక్షితంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. టెక్కలి నియోజకవర్గంలో సుమారు 3044 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

టీడీపీ మూకల దాష్టీకం

- వైఎస్సార్ సీపీ బూత్ ఏజెంట్ తండ్రిపై దాడి
- పరిస్థితి విషమం
- విశాఖ కేజీహెచ్‌కు తరలింపు



కోటబొమ్మాళి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోట మల్లేసు, పక్కన కుటుంబ సభ్యులు

కోటబొమ్మాళి: నిమ్మాడ పంచాయతీ చిన్నవెంకటాపురం గ్రామానికి చెందిన తోట మల్లేసుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు పూతి లక్ష్మణరావు, పూతి భానుచందర్, పూతి కర్రెన్న, పూతి రమణ దాడి చేసి కొట్టినట్లు గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చిన్నవెంటాపురం పోలింగ్‌బూత్ ఏజెంట్‌గా తోట మల్లేసు కుమారుడు మాధవరావు ఉన్నారని, ఆ కోపంతో గురువారం సాయంత్రం గ్రామంలో ఎండలవారాల పండగ జరుగుతుండగా పాతపట్నం గ్రామదేవత గుడి వద్ద మల్లేసుపై మారణాయుధాలతో దాడిచేశారని తెలిపారు. దీంతో మల్లేసు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ప్రస్తుతం మల్లేసును కోటబొమ్మాళి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడి నుంచి వైజాగ్ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలి తెలిపారు.

ఓటమి భయంతోనే..

ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడు లు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, నూక సత్యరాజు, కాళ్ల సంజీవరావు, చింతాడ అనిరుద్రుడు, పట్నాన శ్రీనివాస్, ఎస్.వినోద్, అనపాన బాలకృష్ణ, కవిటి రామ రాజు తదితరులు తెలిపారు. దాడిలో గాయపడిన మల్లేసు కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నేడు యూనివర్సిటీలో క్యాంపస్ డ్రైవ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో దివీస్ ల్యాబొరేటరీ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీలా సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రం సబ్జెక్టుగా బీఎస్సీ, ఎంఎస్సీ పూర్తిచేసిన వారు, కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. చివరి ఏడాది విద్యార్థులు సైతం హాజరు కావచ్చునని అన్నారు. ఆధార్, బయోడేటాలతో ఉదయం 9 గంటలకు హాజరై, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు వేళాయె..!

- దరఖాస్తుకు జూన్ 10 వరకు గడువు
- కోర్సుకు చక్కటి డిమాండ్

ఎచ్చెర్ల క్యాంపస్:

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు వేళయ్యింది. తక్కువ వయస్సులో ఉపాధి లభించడం, క్షేత్రస్థాయిలో పని చేసే కార్మికులకు డిమాండ్ ఉండడం, పరిశ్రమల్లోనూ ప్రత్యేక అవకాశాలు లభిస్తుండడంతో ఈ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది. ఐటీఐ పూర్తి చేశాక ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ వంటి వాటి వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలతో పాటు, 18 ఏళ్లు పూర్తి కాగానే ఉద్యోగాలు లభిస్తాయి. వర్కర్‌గా జీవితం ప్రారంభించి, నైపుణ్య ఉద్యోగులుగా చాలా మంది మారుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీఐ కోర్సుకు విద్యార్థులు ప్రాధాన్యత ఎక్కువగా ఇస్తుంటారు.

ఐటీఐలో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. 10వ తరగతి మార్కులు, కుల, ప్రత్యేక కేటగిరీల రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరణ కొనసాగుతోంది. జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.




ప్రయోగాల్లో విద్యార్థులు

దరఖాస్తు స్వీకరణ అనంతరం హార్డ్ కాపీని దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐకి అందజేయాల్సి ఉంటుంది. ప్రతి ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ కౌంటర్లు నిర్వహిస్తున్నారు. దరఖాస్తుతో 10వ తరగతి మార్కుల జాబితా, కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్, బదిలీ ధ్రువీకరణ పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ అందజేయాలి. మొబైల్‌కు కౌన్సెలింగ్ సమాచారం ఇస్తారు. జూన్ 15వ తేదీ తర్వాత కౌన్సెలింగ్ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తారు.

జిల్లాలో మూడు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు, 20 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐల్లో 760 సీట్లు, ప్రైవేట్ ఐటీఐల్లో 3056 సీట్లు ఉన్నాయి. మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 3806 సీట్లు ఉన్నాయి. జిల్లాలోని ఐటీఐల్లో రెండేళ్ల, ఏడాది కోర్సులు ఉన్నాయి. రెండేళ్ల కోర్సులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్ ఏడాది కోర్సులు వెల్డర్, కోపా, డీజిల్ మెకానిక్, హార్టికల్చర్ వంటి ట్రేడులు నిర్వహిస్తున్నారు. ఏడాది ట్రేడులకు 10వ తరగతి ఫెయిల్ అయిన వారికి సైతం అవకాశం ఉంటుంది. మహిళల కోసం కొన్ని ఐటీఐలో సూయింగ్ టెక్నాలజీ, టైలరింగ్, డ్రెస్ మేకింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ ఏడాది కోర్సులు నిర్వహిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



10వ తరగతి విద్యార్హత తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సు ఐటీఐ. గ్రామీణ ప్రాంత యువత 18 ఏళ్లకే ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుంది. మరో పక్క ఐటీఐలో ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్ వంటి అవకాశాలు లభిస్తాయి. ఇవి విద్యార్థుల్లో నైపుణ్యాలకు దోహదపడతాయి. పరిశ్రమల్లో స్కిల్ వర్కర్ల కొరత ఉంది. నైపుణ్యం ఉన్న వారికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. జిల్లాలో ఐటీఐలు అందుబాటులో ఉన్నాయి. వృత్తి విద్య, క్షేత్రస్థాయిలో శ్రమించి పనిచేసే తత్వం ఉన్నవారు ఐటీఐలో కోర్సుల్లో చేరితే మంచి భవిష్యత్ ఉంటుంది.

– ఎల్. సుధాకర్‌రావు, ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్.

మన తిరుమల



- నేటి నుంచి నారాయణ తిరుమలలో శ్రీవారి కల్యాణోత్సవాలు
- ఆధ్యాత్మిక శోభతో వెలుగొందుతున్న ఆలయం
- రూ.50లక్షలతో మహామండప నిర్మాణం
- రూ.2కోట్లతో శ్రీవారి పుష్కరిణి పనులకు అంచనా

శ్రీకాకుళం కల్చరల్: ఉత్తరాంధ్ర తిరుమలగా పేరు గాంచిన నారాయణ తిరుమలలో శ్రీవారి కల్యాణోత్సవాలకు వేళయ్యింది. ఈ ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో నడుస్తోంది. తిరుమల వెంకన్న ఆలయంలో జరిగిన పూజా విధానాలతో నిత్యం భక్తుల రద్దీతో ఈ ఆలయం విరాజిల్లుతోంది. ఆలయంలో స్వామి కల్యాణోత్సవాలు ఈనెల 17 నుంచి 23 వరకు పాంచరాత్ర ఆగమనం ప్రకారం నిర్వహిస్తున్నారు.

ఆలయ చరిత్ర

ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయం 1961 ఏప్రిల్ 21న ఏర్పాటైంది. అప్పట్లో ఈ ప్రాంతం కొండలతో, గుట్టలతో నిండి ఉండేది. ఈ ఆలయాన్ని గురుగుబెల్లి నారాయణ దాసు నిర్మించారు. ఆయన కలలో వేంకటేశ్వరస్వామి కనిపించి శ్రీవారి పాద ముద్రలు ఉన్న ప్రదేశంలో ఆలయం నిర్మించాలని ఆదేశించారని చెబుతుంటారు. పాదముద్రల కోసం వెతకగా పట్టణంలోని నాగావళికి పశ్చిమ దిశలో పాదముద్రలు కనిపించాయి. అప్పటికే చుట్టు పక్కల ఉండే ప్రజలు ఆ పాదాలకు పూజలు చేయడం కనిపించింది. ఆ ప్రదేశంలో తన శిష్యులతో కొన్ని రోజులు నిద్రచేయగా శ్రీవారు మళ్లీ కలలో కనపడి ఆలయ నిర్మాణానికి తగిన స్థలం ఇదేనని చెప్పారట. ఆలయ నిర్మాణం పూర్తి చేసిన అనంతరం తిరుపతి నుంచి భూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలను తీసుకువచ్చి 1961 ఏప్రిల్ 21 నుంచి 25 వరకు ప్రతిష్టాపనోత్సవం నిర్వహించారు. నాటి నుంచి ఈ ఆలయం నారాయణ తిరుమలగా ప్రసిద్ధి గాంచింది.

ఆకర్షణగా 50 అడుగుల విగ్రహాలు

ఆలయాన్ని దూరం నుంచి చూసేవారికి కూడా ఆకర్షణీయంగా కనిపించేలా పెద్ద పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇందులో 48 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, 52 అడుగుల గరుడాళ్వార్ విగ్రహం, 50 అడుగుల స్వామివారి విశ్వరూప దర్శనం ఏర్పాటుచేశారు.

రూ.50లక్షలతో మహామండప నిర్మాణం

స్వామికి నిత్య కైంకర్యాలు నిర్వహించేందుకు, వెయ్యిమంది భక్తులు ఒకేసారి వేడుకలను వీక్షించేందుకు మహా మండపాన్ని ఆలయం పక్కనే నిర్మించారు. మండపాన్ని నిర్మించడానికి సుమారు రూ.50లక్షలు వెచ్చించారు. అక్కడ స్వామివారి కల్యాణ వేడుకలతో పాటుగా ఇతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

బేడా మండపంలో దేవతామూర్తులు

ఆలయం చుట్టూ ఉన్న బేడా మండపాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దారు. చుట్టూ దేవతామూర్తులు, స్వామివారి దశావతారాల విగ్రహాలతో అలరారుతోంది. స్వామి వైభవాన్ని చాటేందుకు భక్తులందరి సహకారంతో స్వామికి బంగారు కవచాన్ని, వజ్రకవచాన్ని సమకూర్చారు. వీటిని ప్రత్యేక పర్వ దినాల్లో స్వామికి అలంకరిస్తారు.

త్వరలో చేపట్టబోయే పనులు

స్వామి సన్నిధిలో తలనీలాలు సమర్పించేందుకు ఎంతో మంది వస్తున్నారు. తిరుమలకు ఆ సమయంలో వెళ్లలేని భక్తులు ఇక్కడ తలనీలాలను సమర్పిస్తున్నారు. దీంతో వారి కోసం శాశ్వత ప్రాతిపదికన ఒక కల్యాణ కట్ట నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రూ.2కోట్ల అంచనాలతో స్వామివారి పుష్కరిణి నిర్మించనున్నారు. పుష్కరిణి కోసం కేటాయించిన స్థలంలో కొండలు ఉండడంతో వాటిని తొలగించి నిర్మాణం చేస్తున్నారు. పుష్కరిణిలో కూడా అందమైన దేవతామూర్తుల విగ్రహాలు, మధ్యలో మండపంపైన కాళీయమర్దన బాల శ్రీకృష్ణమూర్తిని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆలయం బయట సుందర నందనవనం ఏర్పాటు చేస్తున్నారు.



మూలవిరాట్ స్వామివారు

పుష్కరిణి పనులు ప్రారంభించాం



ఆలయ ఆవరణలో స్వామి పుష్కరిణి పనులు ప్రారంభించాం. స్వామి వైభవం చాటేందుకు అందరి సహకారంతో కృషి చేస్తున్నాం. నారాయణ తిరుమలలో స్వామివారిని దర్శించుకునే వారికి సకల శుభాలు కలుగుతాయి.

– జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త

భక్తుల రద్దీ పెరుగుతోంది



ఆలయంలో భక్తుల రద్దీ నానాటికీ పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నాం. అష్టోత్తర శతనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి పండగలకు ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తుల ఆదరణతోనే ఆలయం అభివృద్ధి చెందుతోంది.

– శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు

కల్యాణోత్సవాల వివరాలు

- 17న స్వామి విశ్వరూపదర్శనం,క్షీరాబిషేక మహోత్సవం, ఉత్సవ సంకల్పం, మంటపారాధన.
- 18న స్వర్ణకవచ దర్శనం, విశేష ఆరాధన, సహస్ర తులసీదళార్చనలు, సాయంత్రం ధ్వజారోహణం.
- 19న శ్రీవారి వజ్రకవచ దర్శనం, సాయంత్రం భునీళా సమేత వేంకటేశ్వరస్వామివారి తిరుక్కల్యాణమహోత్సవం.
- 20న శ్రీవారి రజత కవచ దర్శనం, సాయంత్రం శ్రీవారి గరుడ వాహన సేవ తిరువీధి ఉత్సవం.
- 21న వైరముడి కవచన దర్శనం, సహస్రనామార్చనలు, మహాలక్ష్మికి కుంకుమార్చన.
- 22న విశేష ఆరాధన, సహస్రనామార్చనలు, ఉయ్యాల సేవ.
- 23న పుష్ప కవచ దర్శనం, చూర్ణోత్సవం, అవభృత స్నానం, సాయంత్రం పుష్పయాగ మహోత్సవం
- ప్రతిరోజు అఖండ విష్ణు సహస్రనామ పారాయణం.



క్లుప్తంగా

నాటుసారా, మద్యం సీసాలు ధ్వంసం



నాటుసారా ధ్వంసం చేయిస్తున్న అధికారులు

సోంపేట: సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో గడిచిన ఆరు నెలల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన 4817 లీటర్ల నాటుసారా, 43 లీటర్ల మద్యం నిల్వలను గురువారం స్టేషన్ సమీపంలో ధ్వంసం చేశారు. విశాఖ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వుల మేరకు పలాస డివిజన్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఇస్మాత్ ఆరా బేగం ఆధ్వర్యంలో మద్యం నిల్వలు ధ్వంసం చేసినట్లు సోంపేట ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు.

ఆరో ర్యాంకు సాధించిన విద్యార్థికి అభినందనలు



పెనుపర్తి జగదీష్

కొత్తూరు: కొత్తూరు మండలం కర్లెమ్మ పంచాయతీ పరిధి నేతాజి నగర్ కాలనీకి చెందిన పెనుపర్తి జగదీష్ రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను కనబరిచాడు. కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన జగదీష్ ఏపీఆర్‌సీలో వందకు 96 సాధించి రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు తెచ్చుకున్నాడు. దీనిపై కాలేజి ప్రిన్సిపాల్ రవికుమార్‌తో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు. జగదీష్ తల్లిదండ్రులు బుల్లేశ్వరరావు కృష్ణవేణిలు కార్పెంటరీ పనులు చేస్తూ కుమారుడిని చదివించారు.

మొదటి రోజు 1869 మంది హాజరు



వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో పరీక్ష కేంద్రానికి హాజరైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ –2024 (ఏపీ ఈఏపీసెట్) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, టెక్కలి ఐతం కళాశాల, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు సజావుగా పరీక్షలు పూర్తయ్యాయి. ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 2.30 గంటలు నుంచి 5.30 గంటల వరకు రెండో షిఫ్ట్ పరీక్ష నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో బైపీసీ స్ట్రీం పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 18 నుంచి 23 వరకు ఎంపీసీ స్ట్రీం పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 2027 మంది హాజరు కావల్సి ఉండగా, 1869 మంది హాజరయ్యారు. 158 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వారీగా పరిశీలిస్తే శివానీలో మొదటి షిఫ్ట్‌లో 209కి 195, రెండో షిఫ్ట్‌లో 203 కి 180, వెంకటేశ్వరలో మొదటి షిఫ్ట్‌లో 180 కి 166, రెండో షిఫ్ట్‌లో 178 కి 161, ఐతంలో మొదటి షిఫ్ట్‌లో 300 కి 273, రెండో షిఫ్ట్‌లో 297కి 283, కోర్ టెక్నాలజీస్‌లో మొదటి షిఫ్ట్‌లో 330కి 305, రెండో షిఫ్ట్‌లో 330కి 306 మంది హాజరయ్యారు. కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రత్యేక పరిశీలకులు పర్యవేక్షిస్తున్నారు. నేటితో బైపీసీ స్ట్రీం పరీక్షలు ముగియనున్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రధానం



అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్న నిర్లక్ష్యం వద్దని, పల్లెలు, పట్టణాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని అధికారులకు సూచించారు. ఈ నెల 13న నిర్వహించిన ఎన్నికలు తర్వాత జరిగి న సంఘటనలు, తీసుకోవాల్సిన భద్రత చర్య లపై విశాఖ రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులతో విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం, జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా రేంజ్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించడం వల్ల చిన్నచిన్న సంఘటనలు మినహా ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించుకోగలిగామన్నారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. మరో 15 రోజులు ప్రతిఒక్కరూ ఇదే నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. మన ప్రాంతంలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా క్షేత్ర స్థాయిలో సమర్థంగా పనిచేయాలని తెలిపారు.

‘హార్టికల్చర్‌పై దృష్టి సారించండి’



మాట్లాడుతున్న ఏపీడీ శైలజ

మెళియాపుట్టి: మండలంలో అత్యధిక ఎకరాల్లో హార్టికల్చర్ ద్వారా మొక్కలు నాటడానికి రైతులకు అవగాహన కల్పించాలని టెక్కలి ఏపీడీ శైలజ అన్నారు. గురువారం మండలంలోని ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. హార్టికల్చర్ ద్వారా మొక్కలు నాటితే రైతులకు ఆదాయ వనరులు లభిస్తాయన్నారు. అదేవిధంగా రైతుల పొలాల్లో ఫారం పాండ్‌ల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పని దినాలు కల్పించాలని అన్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే 100 రోజుల పనిదినాల కల్పనపై దృష్టిసారించాలని అన్నారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మద్యం సీజ్



సెబ్ అధికారులు పట్టుకున్న ఒడిశా మద్యం బాటిళ్లు, ద్విచక్రవాహనం


కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామం వద్ద అక్రమంగా ఒడిశా నుంచి మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని, సరుకును సెబ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ దాడిలో ఒడిశా రాష్ట్ర పరిధి గంగాధరపురం గ్రామానికి చెందిన మొగిలి లక్ష్మీనారాయణ అనే వ్యక్తి 60 ఒడిశా బీరు బాటిళ్లను బజాజ్ పల్సర్ బైక్‌లో తీసుకొస్తుండగా మాటువేసి పట్టుకున్నారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి, బీరు బాటిళ్లను, రవాణాకు ఉపయోగించిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ దాడిలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్. జైభీమ్ , పలాస టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

కొట్లాటలో పలువురిపై కేసు నమోదు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం పంచాయతీ పరిధి నీలాపురం గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన కొట్లాటలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు టెక్కలి పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నీలాపురం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ, దాసరి బుడ్డయ్య అనే ఇద్దరు అన్నదమ్ముల మధ్య వారికి సంబంధించిన పశువుల శాల విషయంలో గత కొద్ది నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి దాసరి లక్ష్మీనారాయణ గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా.. అతని తమ్ముడు బుడ్డయ్య మామ సారిపల్లి గోపాల్ లక్ష్మీనారాయణను ఆపి పశువుల శాల గురించి మాట్లాడడంతో గొడవ జరిగింది. ఈ గొడవలో భాగంగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు తీవ్రంగా దాడి చేసుకున్నారు.

ఈ దాడిలో సుమారు 11 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు దాసరి లక్ష్మీనారాయణ భార్య సీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 6పై కేసు నమోదు చేశారు. అదేవిధంగా గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో ఐదుగురిపైన మొత్తం కొట్లాట కేసుకు సంబంధించి 11 మందిపై కేసు నమోదు చేసినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు.

‘సంక్షేమం, అభివృద్ధే గెలిపిస్తుంది’



మామిడి శ్రీకాంత్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దేశంలో ఇప్పటివరకు ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు మహిళల పేరిట అందించడం వల్లే పెద్ద ఎత్తున ఓటింగ్‌కు మహిళలు వచ్చారని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. మరోసారి సీఎంగా జగనన్నను చూడాలన్నదే మహిళల ఆకాంక్ష అని అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ఆదరణ, ఓటింగ్ సరళిని చూసి ఓర్వలేక చాలా చోట్ల టీడీపీ రౌడీమూకలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై, అభిమానులపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఓటు అనే ఆయుధంతో టీడీపీ అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేస్తారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను అడ్డుపెట్టుకుని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ ఇంటి వద్దకే అందించకుండా వారి ఉసురు పోసుకున్నారని విమర్శించారు. దానికి ప్రతిఫలంగా ఓటింగ్‌లో తమ సత్తా ఏంటో చూపించి వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సహకరించారన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీని ఆదరించేలా ఓటింగ్‌కు వచ్చిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 4న వైఎస్సార్‌సీపీ విజయోత్సవాలను జరుపుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

జెమ్స్‌లో అవయవదానం

- కిడ్నీ, లివర్ విశాఖపట్నంకు తరలింపు
- మరో కిడ్నీ జెమ్స్‌లోనే రోగికి మార్పు
- చిరంజీవిగా నిలిచిన శ్రీనివాసరావు



జెమ్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీనివాసరావు ఫ్లెక్సీ



అవయవదానానికి సంబంధించిన సర్టిఫికెట్‌ను కుటుంబ సభ్యులకు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గురువారం అవయవదానం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలను జెమ్స్ వైద్యులు తెలిపారు. శ్రీకాకుళం పరిధిలోని చినమండల వీధికి చెందిన తోట శ్రీనివాసరావు (46) ఈ నెల 14న పెయింటింగ్ పనికి వెళ్తూ సూర్యమహల్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అదే రోజు జెమ్స్‌లో చేరారు. 15వ తేదీ తర్వాత ఆయన బ్రెయిన్ పూర్తిగా పనిచేయడం లేదని వైద్యులు ధ్రువీకరించారు. వెంటిలేటర్‌పై చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. శరీరంలో ఎలాంటి కదలికలు లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. ఆయన కుమారుడు జ్యోతి ప్రకాశ్, చెల్లి సరితాలు కలిసి అవయవదాన సంస్థ గల జీవనదాన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో శ్రీనివాసరావు కిడ్నీ, లివర్‌ను విశాఖపట్నంకు తరలించగా, మరో కిడ్నీని ఇదే ఆస్పత్రిలో వేరే బాధితునికి అమర్చారు. అనంతరం అమరహే శ్రీనివాస్ అంటూ విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది దారి పొడవునా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ లలిత, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ శివ అన్వేష్, ఆర్ఎంఓలు డాక్టర్ బాలమురళి, ప్రవీణ్‌కుమార్, ఆపరేషన్ మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ వరి సాగుకు ముందు తొలకరి వర్షాల్లో నవధాన్యాలను సాగు చేసుకోవటం వల్ల భూసారం పెంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎం ధనుంజయరావు అన్నారు. మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో పాటు కొత్తూరు డివిజన్ స్థాయి ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవధాన్యాల విత్తనాలను వేసుకున్న తర్వాత మొలకలు వచ్చిన 30 నుంచి 50 రోజుల మధ్యలో ఆయా మొక్కలను పొలంలో కలియదున్నటం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ఎరువులు, పురుగుల మందులు విచక్షణరహితంగా వినియోగించటం వల్ల భూసారం క్షీణిస్తుందన్నారు. భూసారం పెంచేందుకు రైతులు తన వంతు ప్రయత్నం చేయాలన్నారు. ఇందుకు రైతులకు అవగాహన కలిగించాల్సిన అవసరం మనపైన ఉందన్నారు. కార్యక్రమంలో రీజనల్ అధికారి హేమసుందరరావు, డివిజన్ ఇన్‌చార్జ్ ఎస్ఎఫ్ఎ గోవిందరెడ్డి, ఐటీడీఏ ఎస్ఎఫ్ఎ ముసలయ్య, ఎంటీ సూర్యనారాయణ, మార్కెటింగ్ ఎంటీ చిన్నమ్మడు, ఐసీఆర్పీ, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

జలుమూరు: మండల పరిధి కరవంజ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు గురువారం ఆత్మీయంగా కలిశారు. నాటి రోజులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. నాటి గురువులు కృష్ణమూర్తి, రామనాథం, జగన్నాథం, శంకరరావు, సింహాచలం, సుదర్శన్, రాములను ఘనంగా సన్మానించారు. అనంతరం కష్టాల్లో ఉన్న తోటి వారికి సాయం చేయడానికి తీర్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జుత్తు నేతాజీ పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. ముఖ్యంగా అధికారుల సమన్వయం, సమష్టి కృషితోనే అది సాధ్యమైందని ఆయన తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా ఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సమావేశమై.. ప్రతి ఒక్కరినీ పేరు పేరునా అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషకరమని, జీవితకాలం ఈ జ్ఞాపకాలు చెరిగిపోవని అన్నారు.

అద్భుతంగా పనిచేశారు..

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి రోజే జేసీ నవీన్‌తో ‘జిల్లాలో ఎక్కువ మంది ఐఏఎస్‌లు ఉన్నారు. ఎన్నికల పనులు ఇక్కడ నడవకూడదు పరిగెత్తాలి’ అని అన్నానని ఆయన గుర్తు చేశారు. అందుకే వెంటనే కంప్లైంట్ మానిటరింగ్ సెల్ తెరిచామని, అందులో 1600 ఫిర్యాదులు వచ్చాయని, పక్కా ప్రణాళిక వేసుకుని, సున్నితంగా పనులు నిర్వహించామని తెలిపారు. ఒక్కోసారి కుటుంబానికి దూరంగా 20 గంటలు కూడా నిరంతరాయంగా పనిచేయాల్సి వచ్చేదని, అంతా కష్టపడి పనిచేశారని ప్రశంసించారు.

జాయింట్ కలెక్టర్ నవీన్‌ని ప్రతేకంగా అభినందించారు. ఎన్నికలు విజయవంతం చేయడంలో ఆయనది కీలక పాత్ర అని తెలిపారు. హింసాత్మక ఘటనలు జరగకుండా అడ్డుకట్ట వేయడంలో ఎస్పీ, రీపోలింగ్ జరగకుండా చేయడంలో సబ్ కలెక్టర్, ఆర్వోలు చేసిన కృషి, గత నాలుగు నెలలుగా నోడల్ అధికారుల పనితీరు.. అన్నీ ఎన్నికలు పూర్తి విజయవంతం చేయడానికి సహకరించాయన్నారు. డేటా ఎంట్రీ, మానవ వనరుల నిర్వహణలో కిరణ్, రవాణా విషయంలో ఆర్టీసీ, డీటీసీ, రికార్డుల నిర్వహణలో చక్రవర్తి, మీడియా సర్టిఫికేషన్‌లో చెన్నకేశవరావు, ఎంసీసీ అమలులో తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేసే సీపీఓ ప్రసన్న లక్ష్మి అద్భుతంగా విధులు నిర్వహించారని చెప్పారు. 22 వేల మందికి శిక్షణలు ఇవ్వడంలో పొరపాట్లకు తావివ్వని, రాష్ట్రంలోనే బెస్ట్ మాస్టర్ ట్రైనర్లు మనకి ఉండటం, చిన్న తప్పు కూడా దొర్లకుండా పనిచేసిన కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సిబ్బంది, ఈవీఎంల విషయంలో కచ్చితత్వంతో పని చేసిన వారికి, అన్ని విభాగాలను సమన్వయం చేసిన జిల్లా రెవెన్యూ అధికారి అంతా ప్రశంసలకు అర్హులేనని తెలిపారు. భోజనం, వసతి, రవాణా విషయంలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు లేవనో, కరెంటు లేదనో, ఓట్ల గల్లంతనో, ఇంకా మరేదోననే ఫిర్యాదులు లేనే లేవని తెలిపారు. ఇక మిగిలిన కౌంటింగ్ ప్రక్రియను కూడా ఇంతే నిబద్ధతతో పూర్తి చేద్దామని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో వారి వారి అనుభవాలను పంచుకున్నారు. కొన్ని సందర్భాల్లో కష్టమైనా తాజా ఫలితం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. చిన్నచిన్న అంశాల్లో సైతం జిల్లా కలెక్టర్ సీరియస్‌గా స్పందించిన విషయాలు క్షేత్రస్థాయిలో తమకు ఎంతగా ఉపయోగపడినదీ వివరించారు. ఒకవేళ కొద్ది సేపు కరెంటు లేకపోతే అనే ఆలోచన లోనుంచి, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక చార్జింగ్ బల్బ్ ఉండేలా వాటిని హుటాహుటిన తెప్పించిన రోజును, కచ్చితంగా అన్ని చోట్లా దోమలు లేకుండా ఫాగింగ్ చేయాలనే అంశాన్ని, ప్రతి చోటా భోజనం వేడిగా, రుచిగా తిన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఒక వీల్ చైర్ కనీసం ఉండేలా, క్యూలైన్ నిర్వహణ కోసం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, మాజీ సైనిక ఉద్యోగులు ఒక్కరైనా ఉండేలా చూసిన తీరు, పోలింగ్ రోజు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉన్న కలెక్టర్ వ్యవహరించిన విధానాన్ని, సున్నితమైన అంశాలపై కూడా ఆయన స్పందించిన తీరుపై పలువురు నోడల్ అధికారులు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మొత్తంగా ఎన్నికల నిర్వహణలో కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని, ఎన్నికల విజయంలో తమను భాగస్వాములు చేసిన జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్‌కు అధికారులంతా కృతజ్ఞతలు తెలిపారు.